
ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన అడవిపల్లె రిజర్వాయర్ పనులు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన పనులు అనంతరం వచ్చిన తెలుగుదేశం పార్టీ హయాంలో పరుగులు పెట్టాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రిజర్వాయర్ గురించి పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.


అసంపూర్తిగా మిగిలి ఉన్న అడవిపల్లె రిజర్వాయర్ ఔట్‌ఫ్లో కాలువ

వైసీపీ పాపం...
అడవికి శాపం

- అడవిపల్లె రిజర్వాయర్‌లో అంతులేని జాప్యం
- రూ.84.80 కోట్లు ఖర్చు పెట్టినా ఫలితం శూన్యం
- పూర్తి కాని ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కాల్వలు


కేవీ పల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్

పీలేరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పథకం ద్వారా కేవీ పల్లె మండలం అడవిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మించి కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించాలని 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సర్కారు తలపోసింది. కేవీ పల్లె, పీలేరు, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పాకాల, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె, బంగారుపాళెం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు మండలాల్లోని 80 వేల ఎకరాలకు సాగునీరు, అనేక వందల గ్రామాలకు తాగునీరు అందేలా రూపకల్పన చేశారు. జలయజ్ఞంలో అడవిపల్లె రిజర్వాయర్ నిర్మాణాన్ని 2006లో రూ.55.59 కోట్లతో ప్రారంభించారు. 2006లో ప్రారంభమైన మొదటి దశ పనులు 2016లో పూర్తయ్యాయి. అప్పట్లో ఆ ప్రాజెక్టు పరిశీలనకు ముఖ్యమంత్రి హోదాలో వచ్చిన చంద్రబాబునాయుడు అడవిపల్లె రిజర్వాయర్ సామర్థ్యం గురించి తెలుసుకుని మరో టీఎంసీ పెంచి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా చిత్తూరు పట్టణానికి తాగునీరు అందిస్తానని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి నిర్మాణం చేయడానికి 2016లో అధికారులు రూ.29.21 కోట్లతో పనులు ప్రారంభించారు.


పీలేరులో పిచ్చి మొక్కలతో నిండిపోయిన హంద్రీ-నీవా కాలువ

టీడీపీ హయాంలో పరుగులు పెట్టిన రిజర్వాయర్ పనులు 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ పాలకులు గానీ, అధికారులు గానీ దాని గురించి పట్టించుకోకపోవడంతో అది అసంపూర్తిగా మిగిలిపోయింది. గొలుసుకట్టు విధానంలో నిర్మితమైన ప్రాజెక్టు కావడంతో ఎగువన రాయచోటి ప్రాంతంలోని రిజర్వాయర్లు నిండితేగానీ అడవిపల్లె రిజర్వాయర్ నిండే పరిస్థితి లేదు. దీంతో పీలేరు నియోజకవర్గానికి సంజీవని వంటి ఆ ప్రాజెక్టు పూర్తిగా అటకెక్కింది. అయితే పీలేరు ఎమ్మెల్యేగా 2024లో గెలుపొందిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తన తొలి అసెంబ్లీ ప్రసంగంలోనే అడవిపల్లెను ప్రస్తావించడం ద్వారా దానిని మళ్లీ వెలుగులోకి తెచ్చారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా అడవిపల్లె రిజర్వాయర్ నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యం, దాని వెనకున్న కారణాలు, వాటిని అధిగమించడానికి ఉన్న అవకాశాలు, అవసరమయ్యే నిధుల గురించి కూలంకషంగా ప్రభుత్వానికి తెలియజేశారు. ఆయన కృషి ఫలించి ఆ రిజర్వాయర్ పనులు మళ్లీ మొదలవుతాయేమోనన్న ఆశ పీలేరు నియోజకవర్గ రైతాంగంలో చిగురిస్తోంది.

ప్రతిపక్షంలో వద్దు...అధికారంలో ముద్దు

వైసీపీ నాయకులు ఎందుకనో ముందు నుంచి అడవిపల్లె ప్రాజెక్టుపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. కానీ చంద్రబాబు ప్రతిపాదించిన చిత్తూరు పట్టణానికి పైపులైను పనులపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడవిపల్లె ప్రాజెక్టులోని నీరంతా పీలేరు నియోజకవర్గానికే పరిమితం చేయాలని, చుక్క నీరు కూడా బయటకు ఇవ్వమంటూ ధర్నాలు, రాస్తారోకోలు, ప్రాత్రికేయ సమావేశాలు నిర్వహించారు. అధికారంలోకి వచ్చాక గుట్టుచప్పుడు కాకుండా పైపులైను పనులు పూర్తి చేసేశారు. అధికార పార్టీ నేతల కారణంగా అడవిపల్లె ప్రాజెక్టు నుంచి చిత్తూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయం వరకు సుమారు రూ.300 కోట్లతో పైపులైను నిర్మించారు. ఆ పనుల్లోనూ స్థానిక నాయకులకు ఆమ్యామ్యాలు ముట్టాయని అప్పట్లో పెద్దఎత్తున పుకార్లు చెలరేగాయి. పైపులైను నిర్మాణంపై చూపిన శ్రద్ధలో పావు వంతు ప్రాజెక్టులోకి నీరు తేవడంపై పెట్టి ఉంటే బావుండేదని పీలేరు నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

అడవిపల్లె రిజర్వాయర్ వివరాలు....

స్టోరేజి సామర్థ్యం	1.817 టీఎంసీలు
ఖర్చు చేసిన నిధులు	రూ.84.80 కోట్లు
హంద్రీ-నీవా కాలువ పరీవాహక ప్రాంతం	114.67 కిలోమీటర్లు
సాగునీరు అందే విస్తీర్ణం	62,800 ఎకరాలు
వాయల్పాడు కాలువ పరీవాహక ప్రాంతం	23 కిలోమీటర్లు
సాగునీరు అందే విస్తీర్ణం	17,200 ఎకరాలు

పూడిపోయిన హంద్రీ-నీవా కాలువలు

పీలేరు, కేవీ పల్లె మండలాల్లోని హంద్రీ-నీవా కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోవడమే కాకుండా చాలాచోట్ల పూడిపోయాయి. హంద్రీ-నీవా పథకంలో చిట్టచివరి నియోజకవర్గం కావడంతో అప్పటి పీలేరు ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని సుమారు 80 వేల ఎకరాలకు సాగునీరు అందే విధంగా రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఆ కాలువలన్నీ పూడిపోయే దుస్థితికి చేరుకున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎందుకనో వైసీపీ నాయకులు అడవిపల్లె గురించి పట్టించుకోలేదని, అది సమగ్రంగా పూర్తయి ఉంటే పీలేరు నియోజకవర్గ రైతాంగం లాభపడినంతగా మరే నియోజకవర్గ ప్రజలు లాభపడి ఉండరని పలువురు విశ్రాంత ఇంజనీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అడవిపల్లె పనులను గాడిలో పెట్టాలని వారు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ పాలకులు చేసిన తప్పిదమే

- ఇది రాజ్యాంగ విరుద్ధం
- కేంద్ర మాజీ మంత్రి చింతమోహన్



మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పాలకులు చేసిన తప్పదమేనని, ఇది భారత రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఆదివారం మదనపల్లెలో మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో ముఖ్య అతిథిగా చింతా మోహన్‌తో పాటు మాజీ ఎంపీ చిత్తూ రు రెడ్డెప్ప, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు పాల్గొన్నారు. పట్టణంలో నిమ్మనపల్లె సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ స్వార్థ రాజకీయం కోసం మాలలను, మాదిగలను విడదీసింది చంద్రబాబే అన్నారు. మాలల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలంటే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి మెజార్టీతో వర్గీకరణ చేయాలే తప్ప రెండు మూడు రాష్ట్రాల మద్దతుతో ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాలల జేఏసీ నాయకులు డాక్టర్ యామల సుదర్శనం, నాయకుల అశోక్, చంద్రయ్య, గుండాల మనోహర్, మల్లెల మోహన్, జిల్లా అధ్యక్షుడు వీరయ్య, వీరనాల మాణిక్యం, సుధాకర్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి భక్తులకు
మౌలిక వసతులు అందేనా?



7

కనువిందు చేసిన ఇంద్రధనుస్సు


ములకలచెరువులో దర్శనమిచ్చిన ఇంద్ర ధనుస్సు

ములకలచెరువు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ఆదివారం సాయంత్రం ఇంద్ర ధనుస్సు కనువిందు చేసింది. ఒకవైపు ఎండ, మరోవైపు చిరు జల్లులు కురుస్తూ ఆకాశంలో ఐదు నిమిషాల పాటు ఇంద్ర ధనుస్సు దర్శనమిచ్చింది. దీంతో ములకలచెరువు వాసులు ఇంద్ర ధనుస్సును సెల్‌ఫోన్లలో బంధించారు.

చెరువులకు జలకళ



కృష్ణారెడ్డి చెరువులో జలకళ


మొరవ పోతున్న కృష్ణారెడ్డి చెరువు

సుండుపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని చిన్న, పెద్ద చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. రెడ్లచెరువు, కృష్ణారెడ్డిచెరువు, నారాయణరెడ్డిచెరువు, రాత్రిచెరువు, కొత్తచెరువు, ఊటచెరువు, గుర్రప్పచెరువు, పెద్దచెరువు, అత్తాకోడలు చెరువులు నిండిపోయాయి. చెరువులు నిండడంతో మొరవలు పారుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడు పుష్కలంగా నిండటంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మదనపల్లె కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో భువనేశ్వరీ అలంకారం


రాయచోటి వీరభద్రాలయంలో మహాలక్ష్మిగా భద్రకాళీ అమ్మవారు


మహాచండీదేవిగా గుర్రంకొండ రెడ్డెమ్మతల్లి

మహాచండీ.. దుర్గా భవానీ...

- వేడుకగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ అలంకారాల్లో అమ్మవారి దర్శనం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవారు మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు ఆలయాల్లో 7వ రోజు ఆదివారం దేవీ శరన్నవరాత్రి దసరా పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పీలేరులోని రౌద్రాల అంకాలమ్మ, కలికిరి యల్లమ్మ తల్లి, గుర్రంకొండలోని రెడ్డెమ్మ తల్లి మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాజంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో, మదనపల్లెలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో భువనేశ్వరి అలంకారం, కోర్టులో గంగమ్మ ఆలయంలో శాకంబరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.


రాజంపేటలో గాయత్రీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి


మదనపల్లె కోర్టులో గంగమ్మ ఆలయంలో శాకంబరి అలంకారం


మహాచండీ అలంకరణలో పీలేరు రౌద్రాలమ్మ


మహాచండీ అవతారంలో కలికిరి యల్లమ్మ తల్లి


నందలూరు: గాయత్రిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


ఒంటిమిట్ట అమ్మవారిశాలలో..


రాయచోటి: గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి


రాయచోటి: సంతానలక్ష్మిగా తోపు గంగమ్మ


రామాపురం: బాలత్రిపుర సుందరిగా దర్గా మాతాజీ


రైల్వేకోడూరు: గౌరీపూజ అలంకారంలో వాసవి


రాజంపేట: పార్వతీదేవి అలంకరణలో చౌడేశ్వరి

గాయత్రీం.. కమలాసనాం భజే..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జగన్మాత పలు అలంకారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లో కన్యకాపరమేశ్వరి గాయత్రిదేవి అలంకారంలో, చౌడేశ్వరిదేవి ఆలయంలో పార్వతి, సాదుకామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు కామాక్షి, ఏకాంబరేశ్వరస్వామి అలంకరణలో, ఉదయగిరి యల్లమ్మ ఆలయంలో కాళరాత్రి, వెంకట్రాజంపేటలో కనకదుర్గ ధనలక్ష్మి అలంకారంలో అనుగ్రహించారు.

నందలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం రాత్రి గాయత్రిదేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహశ్రేష్టి, సెక్రటరి గెలివి నాగసురేంద్ర కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పురోహితుడు బండాత్మకూర్ శివకుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం దశ హారతులతో మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసులు, రెంటాల హరికృష్ణ, రెంటాల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం లో ఆదివారం అమ్మవారు గౌరీపూజ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో పంచామృతాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం, దేవి భాగవత పారాయణం, నవావరణ, సువాసిని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీలోని శ్రీదర్బారు సాయినగర్‌లో వెలిసిన సమర్థ సద్గురు దర్గా మాతాజీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం బాలత్రిపుర సుందరీదేవి అలకారంలో శ్రీదుర్గా మాతాజీ ప్రజలకు దర్శనమిచ్చింది. ఉదయం మహాగణపతిపూజ, గంగపూజ, మృత్తికపూజ, నవగ్రహపూజ, కలశ స్థాపన, సద్గురు దర్గా స్వామిజీ సద్గురు దర్గా మాతాజీకి అభిషేకం, అలంకరణలు, మహామంగళహారతితో ముగించారు. భక్తులు అందరికీ అన్నదానం నిర్వహించారు.

రాయచోటి-నేతాజీ సర్కిల్: పట్టణంలోని ఉమామహేశ్వరాలయంలో ఉమాదేవి అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. వేదపండితుడు నటరాజస్వామి ఆలయ నిర్వాహకుడు శివగంగిరెడ్డి ఏర్పాట్లు చేశారు.

రాయచోటిటౌన్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిగా, కొత్తపేట రామాపురంలో చౌడేశ్వరి మహాలక్ష్మిగా, ఉమామహేశ్వర ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిగా, అగస్త్యేశ్వరాలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. తోపు గంగమ్మ ఆలయంలో సంతాన లక్ష్మిగా దర్శనమిచ్చారు.

మాతమ్మకు పొంగుబాళ్లు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో భాగంగా మండల పరిధిలోని మంగంపేట గ్రామ పంచాయతీలో ఆదివారం మాతమ్మకు సామూహిక పొంగుబాళ్లు సమర్పించారు. మంగంపేట సర్పంచ్ మినుకు సుధాకర్ ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. పోతురాజును ఎత్తుకొని చిందులు వేశారు.

పోతుగుంటకు సన్మానం

నందలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానం బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడును ఆదివారం ఆయన స్వగృహంలో నందలూరు జనసేన నాయకులు కొట్టే శ్రీహరి, టీడీపీ నాయకులు ఉప్పుశెట్టి రెడ్డయ్య మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు హిమగిరినాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో కల్యాణోత్సవం

చిట్వేలి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా పాతచిట్వేలి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి కలశాభిషేకం అలంకరణ, గణపతి హోమం అనంతరం వీరభద్రస్వామి భద్రకాళి అమ్మవారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అండర్-19 తెలంగాణ క్రికెట్ జట్టుకు రాయచోటి విద్యార్థి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిదా టెక్నో స్కూల్ క్రికెట్ కోచింగ్ బ్యాచ్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అసద్ ఇటీవల ఉత్తరాఖండ్ లో జరిగిన జూనియర్ (అండర్-19) రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ తరఫున పాల్గొని అద్భుత విజయాన్ని సాధించాడు. వచ్చే నెలలో జరగబోయే ఇండియా- శ్రీలంక మ్యాచ్‌లో పాల్గొనబోతున్నాడు.

మైనర్ వాహనం నడిపితే యజమానిపై చర్యలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మైనర్ బండి నడిపితే, ఆ వాహన యజమానిక కూడా నిందితుడు అవుతాడని రాయచోటి అర్బన్ సీఐ వెంకటాచలపతి హెచ్చరించారు. ఆదివారం రాత్రి రాయచోటి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను, వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. భారీ మొత్తంలో జరిమానాలు విధించారు. మైనర్‌కు వాహనం ఇచ్చిన యజమానులు చటపరంగా నిందితులేనని హెచ్చరించారు. ఈ విషయం గుర్తుంచుకుని చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని రాయచోటి అర్బన్ ఇన్‌స్పెక్టర్ బీబీ చలపతి తెలిపారు.

పని గంటల పెంపుపై టీడీపీ, వైసీపీ దొందూ. దొందే!

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటలను పెంచుతూ చేసిన తీర్మానాన్ని వైసీపీ వాకౌట్ చేసి మద్దతు తెలిపిందే గానీ వ్యతిరేకించలేదని, కార్మికుల విషయంలో రెండు పార్టీల విధానాలు ఒకటేనని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో సీఐటీయూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు కార్మికుల శ్రమను దోచే పనిగంటల పెంపు నిర్ణయాన్ని తక్షణం రద్దు చేయాలని, మహిళలచే రాత్రి వేళల్లో పనిచయించడం మానుకోవాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వానికి పనిగంటల పెంపు నిర్ణయం మరణశాసనంగా మారుతుందన్నారు. మూడు షిఫ్టులు, రెండు షిఫ్టులుగా మారడంతో ప్రతి ముగ్గురిలో ఒకరి ఉపాధి పోతుందని, నిరుద్యోగులకు ఉపాధి కలగా మారుతుందని విమర్శించారు. పగలే మహిళలకు రక్షణ కల్పించలేని కూటమి ప్రభుత్వం రాత్రి వేళల్లో వారితో పనిచేయించడం మానుకోవాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త సర్వేలో అధిక పని గంటలతో 30 శాతం కార్మికుల్లో హృద్రోగ మరణాలు పెరుగుతున్నాయని, సుదీర్ఘ పని గంటలతో కార్మికుల్లో మానసిక సమస్యలు పెరుగుతాయని, సరుకుల క్వాలిటీ పడిపోయి అంతర్జాతీయ పోటీలో నిలబడలేకపోతాయన్నారు. కార్మికుల కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయంతో ఛిన్నాభిన్నం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం ఉన్నప్పుడే అనేక పరిశ్రమల్లో 12 గంటలు పనిచేయించడం జరిగిందని, ప్రభుత్వం అధికారికంగా 12 గంటలు పనివేళలు ప్రకటిస్తే యాజమాన్యాలు 14, 16 గంటలు పనిచేయించుకుని బానిసలుగా మారుస్తాయని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయకపోతే పోరాటాలకు కార్మికులు, ఉద్యోగులు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, కోశాధికారి హరిశర్మ, జిల్లా కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి, మెహరున్నిషా, ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య, ఓబులమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

యువతకు మార్గ నిర్దేశకుడు సర్దార్ భగత్‌సింగ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువతకు మార్గ నిర్దేశకుడు సర్దార్ భగత్‌సింగ్ అని మండల సీపీఐ అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో సమాజసేవకు తోడ్పాటు కావాలని పిలుపు నిచ్చారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుగోల మణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మాద రాజు గంగాధర్, సీపీఐ ఇన్‌చార్జి జ్యోతి చిన్నయ్య, నియోజకవర్గ కార్యదర్శి శెట్టిపల్లి పెంచలయ్య, ఏఐవైఎఫ్ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, నాయకులు గణేష్, నాని, అశోక్ పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతి అరవపల్లెలోని బచ్చు భవన్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విభా ఎరుడైట్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ జయభాస్కర్‌రావు అధ్యక్షతన ఆదివారం భగత్‌సింగ్, గుర్రం జాషు వాకు నివాళులర్పించారు. డాక్టర్ బచ్చు జయ భాస్కర్ రావు, కుర్రా మణియాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, మంటి మారయ్య, గండికోట కృష్ణకుమార్, ఆంజనేయులు, తీగలకుంట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : గుర్రం జాషువా జయంతి సందర్భంగా రాజంపేటలో ఆదివారం ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో జీఎంసీ కల్యాణమండపంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల రాముడు, శ్రీశైలం ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు గుర్రం జాషువా జీవిత విశేషాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ; రాయుడు తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు


జాషువా చిత్రపటం ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు సాయిలోకేశ్, రమేష్‌నాయుడు

చోరీల నియంత్రణకు పోలీసుల చర్యలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీల నియంత్రణలో భాగంగా పోలీసులు రాత్రి వేళల్లో తనిఖీలతో పాటు గస్తీ ముమ్మరం చేశారు. శనివారం రాత్రి అనవసరంగా రోడ్లపై తిరిగే వ్యక్తులతోపాటు, లాడ్జిలలో ఉంటున్న వారి వేలిముద్రలను ఎంఎస్‌సీడీ పరికరంతో తనిఖీ చేశారు. రాత్రి 10 గంటల అనంతరం అనవసరంగా రోడ పైన తిరుగకూడదని పోలీసులు సూచించారు. రాత్రి వేళల్లో ఇంటి గేట్లు, తలుపులకు తాళం వేయకుండా వదిలిపెట్టడం చేయరాదన్నారు. ఇంటి పరిసరాలను కవర్ చేసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తలుపులకు తాళం వేసి స్వగ్రామాలకు వెళ్లేవారు విలువైన ఆభరణాలను, వస్తువులను వెంట తీసుకొని వెళ్లాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంటి ముందు పార్కింగ్ చేసే మోటారు సైకిళ్లకు తప్పనిసరిగా ముందు చక్రానికి లాక్ వేసుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలని రాయచోటి అర్బన్ పోలీసులు పట్టణ ప్రజలను హెచ్చరించారు.


అనుమానితుల వేలిముద్రలు సేకరిస్తున్న అర్బన్ పోలీసులు

'బలిజలు ఏకతాటిపైకి వస్తేనే మనుగడ'

రైల్వేకోడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బలిజలు ఏకతాటిపైకి వస్తేనే మనుగడ ఉంటుందని బలిజ సేవా సంఘం సీనియర్ నాయకుడు నల్లంశెట్టి యానాదయ్య తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలోని తేజ కల్యాణ మండపంలో బలిజ సామాజిక వర్గ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కార్తీకమాసంలో బలిజ వనభోజన కార్యక్రమం నిర్వహించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కడ అనువుగా ఉంటే అక్కడ బలిజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సభ్యులు సూచించారన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని నిర్వహించదలచామని వివరించారు. మళ్లీ మరోసారి సమావేశం నిర్వహించి అందరి నిర్ణయాలను తీసుకుని వేదికను నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు నార్జాల దాశరథి, పోతురాజు నవీన్, సీహెచ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నల్లంశెట్టి యానాదయ్య

జూదరుల అరెస్టు

చిన్నమండెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోనమల వద్ద ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బోనమల వద్ద జూదం ఆడుతున్నారన్న సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని, రూ.12,870 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు



'కల్యాణ మండపం నిర్మాణం.. పేదలకు ఉపయోగం'

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలు వివాహం చేసుకునేందుకు ప్రత్యేకంగా కల్యాణ మండపం నిర్మించడం వారికి ఊరట కలిగించే విషయమని కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి , టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ మామగారైన ఆర్. రాజగోపాల్‌రెడ్డి మంత్రిగా ఈ ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చేశారని మాధవిరెడ్డి అన్నారు. వెలిగల్లు ప్రాజెక్టుతో లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాలకు తాగు, సాగు నీరు అందించారన్నారు. ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించిన కడియాల కృష్ణమూర్తి, ఆయన కుమారుడు వెంకట్రప్రసాద్‌ను అభినందించారు. వైఎస్‌ఆర్ క్రికెట్ ఆడిటోరియం ఛైర్మన్ శ్రావణ్‌రాజురెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హరినాథ్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు, ఆర్‌ఆర్ అభిమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే మాధవి

మానవత సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైవీఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత జయప్రకాశ్‌రెడ్డి, సంకల్ప హాస్పిటల్ వైద్యులు ప్రశేన్‌రెడ్డి కోరారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవతా సంస్థ నెలవారి సమావేశాన్ని సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

సుండుపల్లె : దాతల సహకారంతో త్వరలో సుండుపల్లె మండలానికి మానవతా సంస్థ ఆధ్వర్యంలో శాంతిరథం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ జిల్లా ఆర్థిక కార్యదర్శి, హరికుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

లక్కిరెడ్డిపల్లె: పేదలను ఆపద నుంచి ఆదుకునే సంస్థ మానవత సేవా సంస్థ ఆ సంస్థ ఛైర్మన్ బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం పాలెం గొల్లపల్లెలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనవత ద్వారా బాడీఫ్రీజర్లు, శాంతి రథాలు, నైతిక విలువలు, పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శివయ్య, కోశాధికారి రవిశంకర్, డైరెక్టర్లు శ్రీనివాసులు, రమణ, ధనుంజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

నందలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అరుంధతివాడలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సమావేశంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు వెంకటరామిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పనితీరు ప్రశంసించారు. ఇద్దరు ఉత్తమ వలంటీర్లకు నగదు బహుమతి అందించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ నీలవేణి మాట్లాడుతూ సమాజం నుంచి కార్యకర్తలు చాలా నేర్చుకుంటారని విద్యలో ఇలాంటి సేవా కార్యక్రమాలు అంత ర్భాగమని తెలిపారు. కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్య క్రమంలో రమేష్, శివశంకర్, నాగరాజ, రాజమ్మ, స్థానికులు పాల్గొన్నారు. ఓటు గురించి ఓటర్ల చైతన్యం గురించి ర్యాలీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

రాజంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. ఆదివారం ఆయన రేబిస్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకాలను వివరించారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొబైల్ అంబులెన్స్ వెటర్నరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, పశువైద్య సహాయకులు బి.మణి, దత్తాత్రేయ, హరిబాబు పాల్గొన్నారు.


కుక్కకు టీకాలు వేస్తున్న వైద్యుడు

మైసమ్మ నెమలి గొడుగు ఊరేగింపు

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలం గోరా వాండ్లపల్లెలో మైసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు నెమలి గొడుగు సమర్పించారు. ఈ సందర్భంగా గొడుగుకు మంగళవాయిద్యాల నడుమ బావి వద్ద పూజలు చేసిన అనంతరం గ్రామోత్సం నిర్వహించారు. ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక గౌరవ సలహాదారు ఏజీయం డీ. రమణయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది టీ. ఈశ్వర్, రాయచోటి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీ. నాగముని వేదిక రాష్ట్ర నాయకుడు జీవానందం, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకుడు వీరభాస్కర్ రెడ్డెయ్య, రామకృష్ణ, వెంకట్రమణ, శివ, రవి పాల్గొన్నారు.


గొడుగును ఊరేగిస్తున్న వడ్డెరలు

గ్రామదేవత దాసాలమ్మ సన్నిధిలో 'చమర్తి'

రాజంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొగురుపేట గ్రామ దేవత శ్రీ దాసాలమ్మ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకుస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కుమార్, శ్రీశైలం దేవస్థాన ఛైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, గీతాంజలి రమణ, పూల నరసింహులు, అరుణాచలం, తోట రామయ్య, అబ్బిగారి వేణుగోపాల్, కూటమి నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


చమర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

స్మార్ట్ రేషన్‌కార్డులు తీసుకోండి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులను తీసుకోనివారు చౌకదుకాణం డీలర్లను సంప్రదించాలని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్డులు తీసుకున్న వారు అడ్రస్సులు, పేర్లు తప్పులు ఉంటే వెంటనే సచివాలయానికి వెళ్లి మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. స్మార్టు కార్డు ఉంటేనే డీలర్లు సరుకులు ఇస్తారన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ సీనియర్ నాయకులు కొప్పుల ఈశ్వరయ్య, లక్ష్మయ్య కుటుంబాలను ఆదివారం ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డెయ్య, టీడీపీ నాయకులు ఆరీఫ్‌బాషా ు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు చిన్నఓబులేసు, పెద్ద ఓబులేసు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి భక్తులకు
మౌలిక వసతులు అందేనా?

● నిపుణుల కమిటీ ప్రణాళికలు సిద్ధమయ్యేనా?.. ● పనులు ప్రారంభం అయ్యేనా?

ఒంటిమిట్ట కోదండ రామాలయం



ఒంటిమిట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం విడిపోవంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒంటిమిట్ట కోదండరామునికి ప్రభుత్వం తరపున ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 2015 ఆలయ అభివృద్ధి కోసం ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని టీటీడీలో విలీనం చేశారు. టీటీడీ అధికారులు ఆలయ అభివృద్ధి కోసం అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తూ వస్తున్నారు. కాని భక్తుల మౌలిక వసతుల గురించి పట్టించుకోకపోవడంతో సరైన వసతులు లేక భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాత్రివేళల్లో ఇక్కడ బస చేయాలంటే కష్టంగా ఉందని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ ఆరుబయటనే నిద్రపోవాల్సి వస్తుండటంతో దోమలు, దొంగలతో భయపడుతున్నారు. దీంతో భక్తులు రాత్రివేళ ఇక్కడ బస చేయకుండా వెళ్లిపోతున్నారు. ఈ యేడాది సీతారాముల కల్యాణం ఉత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేశారు. కల్యాణం అనంతరం టీటీడీ అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు నిపుణుల కమిటీతో ప్రణాళికలు తయారు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు కొద్దిరోజుల క్రితం నిపుణుల కమిటీ ఒంటిమిట్టకు వచ్చి ఆలయ మాడవీధులు, రథశాల, పుష్కరిణి, సంజీవరాయస్వామి ఆలయం, మాల ఓబన్న స్థూపం, శృంగిశైలం, సత్రపాలెం, కొండరామ లక్ష్మణ తీర్థాలు, కల్యాణవేదిక ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలి, ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి అన్న విషయంపై చర్చించుకున్నారు.



ఒంటిమిట్టలోని మాల ఓబన్న స్థూపం



శృంగిశైలి పర్వతం

గుర్తించిన పనుల వివరాలు..

భక్తులకు ఆహ్లాదపరిచేలా శిల్పారామం, పక్షుల పార్కు, ఔషధ ఆయుర్వేద ఉద్యానవనాల ఏర్పాటు, మాడవీధుల విస్తరణ, ఒంటిమిట్ట చెరువు అభివృద్ధి సుందీకరణ, వావిలకొలను సుబ్బారావు ధ్యానమందిరాన్ని కొత్తగా నిర్మించడం, శృంగిశైలం చుట్టూ గిరిప్రదక్షిణ కోసం రహదారి, ఆలయ సమీపంలోని నాగేటి తిప్పసత్రపాలెం, కొండగుట్టలకు హరిత శోభ తెచ్చేలా మొక్కల పెంపకం, కల్యాణవేదిక వద్ద శిల్పాల ఏర్పాటు, మాల ఓబన్న మండపం, యాత్రికులు విడిది చేయడానికి అనువైన గదులు, శుభ కార్యాలయాలకు కల్యాణమండపం, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక తదితర పనులను నిపుణుల కమిటీ గుర్తించినట్లు తెలిసింది. కాని ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. నిపుణుల కమిటీ ప్రణాళికలు సిద్ధం చేశాయా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సిద్ధమై ఉంటే పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని రామభక్తులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

జాతీయ స్థాయిలో ప్రభావితమైంది..



ఒంటిమిట్ట కోదండరామాలయం ఈనాడు రాష్ట్రస్థాయిని దాటి జాతీయ స్థాయిని కూడా అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో ప్రభావితమైంది. తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకవర్గం, రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ పసుపులేటి శంకర్, పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు, ఒంటిమిట్ట

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి..



ఒంటిమిట్ట కోదండరామ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి. వసతులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

- సోమిశెట్టి మనోహర్‌బాబు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు, ఒంటిమిట్ట

అమ్మానాన్న లేరు..

● అనాథలైన చిన్నారులు



అనాథలుగా మారిన చిన్నారులు లక్ష్మి, యశ్వంత్

దువ్వూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆలన, నాన్న పాలనలో పెరగాల్సిన చిన్నారులు ఆ అదృష్టానికి దూరమయ్యారు. బ్రతుకు బండి ఎలా లాగాలో, బ్రతుకుదెరువు ఏమిటో తెలియని అన్నాచెల్లెలుకు కన్నతల్లిదండ్రులు మరణించడంతో పలువురిని కలచివేస్తోంది. 105రోజుల వ్యవధిలో మొదట తల్లి, ఈనెల 28న శనివారం తండ్రి మరణంతో ఏడేళ్ల యశ్వంత్, ఆరేళ్ల లక్ష్మి అనాథలయ్యారు.

దువ్వూరు గ్రామానికి చెందిన నరసింహులు (30) కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతోపాటు శనివారం పిట్స్ కూడా రావడంతో అకస్మాత్తుగా మృతి చెందాడు. ఇదే సంవత్సరం జూన్ నెల మధ్యలో చిన్నారుల కన్నతల్లి గంగాభవానీ (26) అనారోగ్య కారణంగా మృత్యువాత పడింది. తల్లి మరణించిన 105 రోజులకే తండ్రి కూడా మృతి చెందడంతో చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం తాత బాలరంగడు ఈ బిడ్డలకు జీవనాధారమయ్యాడు. ఈ సంఘటన చుట్టుపక్కలవారిని కంటతడిపెట్టిస్తోంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● చిన్నారులకు తీవ్ర గాయాలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సమీపంలోని ఇరుకురాళ్ల బోటు వద్ద స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇరువురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. కడపలోని రవీంద్రనగర్‌కు చెందిన పట్నం ఆదిలక్షుమ్మ(65) తన మనవడు సాయికిరణ్, మనవరాలితో కలిసి ఆదివారం ఉదయం 11గంటలకు నందలూరు నుంచి కడపకు స్కూటీలో బయలుదేరారు. ఇరుకురాళ్ల బోటు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో వీరిని కడప రిమ్స్‌కు తరలించగా ఆదిలక్షుమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కడప క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్ గూడ్స్ గోడలు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాధరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45సంవత్సరాల మధ్య ఉంటుందని, గూడ్సు గోడల వద్ద ఉండేవాడని, అయితే అనారోగ్య కారణంగా మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ గుర్తించినవారు 9121100510, 9121100511 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు కథనం మేరకు... ముష్టూరుకు చెందిన ఖాసీమ్ తన ఆటోలో ప్రయాణికులను మదనపల్లికి తరలిస్తుండగా రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లీలాప్రియదర్శిని, ప్రియాంక, చెంద్రాయుడు, హరిత, మరొకరు గాయపడ్డారు. గాయపడిన వారిని మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కట్టా పుట్టాలమ్మ ఆలయంలో చోరీ

ఓబులవారిపల్లె/రైల్వేకోడూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న కట్టా పుట్టాలమ్మ దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు సమాచారమిచ్చారు. రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలో ఉన్న బీరువాలను పగులగొట్టి అందులో ఉన్న నగదును, పలు వస్తువులను దొంగలు అపహరించుకుని వెళ్లినట్లు ఎస్ఐ వివరించారు. ఈ మేరకు విచారిస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన బెస్తల అమరావతి(68) కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. అమరావతికి మతిస్థిమితం సరిగాలేదని, ఆమె ఈనెల 25వ తేదీ సాయంత్రం నుంచి అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9121100530కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ముగిసిన యంత్ర 2కే25

● 500 మంది విద్యార్థులు హాజరు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన యంత్ర 2కే25 ఆదివారం ముగిసింది. ఈ మూడు రోజుల పాటు నెక్స్ జనరేషన్ రోబోటిక్స్ విత్ ఏఐ అండ్ నోడ్ ఎంసీయూ మరియు ఆటోడెస్క్ ఫ్యూజన్ 360 విత్ 3డీ ప్రింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 500మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ పోటీలలో పేపర్ ప్రజెంటేషన్స్, ప్రాజెక్టు వర్క్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన స్టెల్లాంటిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ పి.శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన అర్థరోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి హర్షవర్ధన్, విశాఖపట్టణం పోర్ట్ అథారిటీ అసిస్టెంట్ సెక్రటరీ వి.అజయ్‌తేజ, కళాశాల మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యంత్ర 2కే25లో తయారు చేసిన ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

శక్తివంత సందేశాన్ని తీసుకెళ్లేందుకే శాంతి ర్యాలీ

● యూఎస్‌వో సెక్రటరీ జనరల్ నీనా జైన్ ● పులివెందులలో ఆకట్టుకున్న పీస్ ర్యాలీ



పీస్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



ర్యాలీలో ఆయా రాష్ట్రాల సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య ఆధారంగా శక్తివంతమైన సందేశాన్ని తీసుకెళ్లడమే శాంతి ర్యాలీ ఉద్దేశమని యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్‌వో) సెక్రటరీ జనరల్ నీనా జైన్ అన్నారు. పులివెందులలో యూఎస్‌వో ఆధ్వరంలో ఆలిండియా స్కూల్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్‌లో ఈ ర్యాలీని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీనా జైన్ మాట్లాడుతూ భారతదేశంలో తమ సంస్థ 75ఏళ్లుగా విద్య గొప్పదనం, సంస్కృతి, సంప్రదాయలను వివరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒక్కచోటకు చేరడంతో వారివారి సంస్కృతి, సంప్రదాయాలను ఒకరికొకరు తెలుసుకుంటారన్నారు. గౌరవం, శాంతి, సహనం వంటి ఇతర విలువైన ఆలోచనలు కనుగొంటారన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యతో పాటు విలువైన ఆలోచనలతో అదనపు విద్య తెలుసుకుంటారన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, సంస్థ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుప్రకాష్ మాట్లాడుతూ జాతికి ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా యూఎస్‌వో పనిచేయడం అభినందనీయమన్నారు. పులివెందులలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం వుయ్ వాంట్ గ్లోబల్ పీస్ అంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మాన్ని పాటించడమే మానవత



వితరణ చేసిన సామగ్రితో మానవత సంస్థ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపనిషత్తులు, వేదాల సారాంశం మనిషి తన ధర్మాన్ని పాటించడమే మానవత్వమని మానవతా సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆదివారం ఉదయం మానవతా సంస్థ నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది జీవరాసుల ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దాతలు పోతుల వెంకటరామిరెడ్డి తన భార్యజ్ఞాపకార్థం శాంతిరథం, మోపూరి భాస్కర్‌రెడ్డి, మోపూరి రామకృష్ణారెడ్డి సోదరులు ఒక బాడీఫ్రీజర్, అమెరికాలో ఉన్న సొంటం విశ్వనాథరెడ్డి ఒక బాడీఫ్రీజర్ వితరణగా ఇచ్చారు. వాటిని మానవతా టీం ప్రారంభించింది. కార్యక్రమంలో ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్ రవితేజ రెడ్డి, సాయి విజ్ఞాన్ స్కూల్ అధినేత భూపతి మైథిలి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం, డైరెక్టర్లు అవటాల రామంజులరెడ్డి, రాటాల గోపి, భూపతిరాయల్, పప్పనబోయిన సుబ్బరాయుడు, సమ్మెట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో మెరుగైన సేవలకు కృషి

సీకేదిన్నె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఉపరవాణా శాఖ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.వీరరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన పోర్టర్ ద్వారా వివిధ పనుల కోసం దరఖాస్తు చేసుకుని పది నెలలకు మించిన దరఖాస్తులు 279 ఉన్నాయని, అందులో అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నవి 83 మాత్రమేనని, వాటిని అప్రూవల్ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన 196 దరఖాస్తుల డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడం వలన పూర్తి చేయలేకపోతున్నామన్నారు. ఆయా వాహనదారులు పూర్తి డాక్యుమెంట్ల జిరాక్స్‌లను అక్టోబరు 7వ తేదీలోగా అందించాలని సూచించారు. అందించని పక్షం లో వాటిని రద్దు చేస్తామన్నారు.

అనుమానాస్పద వస్తువులు విక్రయిస్తే సమాచారం ఇవ్వండి

పులివెందుల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వస్తువులు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అర్బన్ సీఐ సీతారామిరెడ్డి గుజిరి నిర్వాహకులకు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని గుజిరి నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మధ్యకాలంలో పొలాల వద్ద, మోటర్ల వద్ద వైర్లను దొంగలించుకొనిపోతున్న సందర్భంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారరు. ఇలాంటి వారు రాగివైరును అమ్మడానికి వచ్చినపుడు సమాచారం ఇవ్వాలన్నారు.

సమాజానికి అవసరం సూక్తి సుధాలహరి



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి అవసరమైన విలువైన అనేక అంశాలను తన సూక్తిసుధాలహరి పుస్తకం ద్వారా అందించిన రచయిత స్వర్గీయ ఇమాంసాహె బ్ అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు కొనియాడారు. ఇమాంసాహెబ్ రచించిన సూక్తి సుధాలహరి పుస్తకావిష్కరణ సభ ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇమాంసాహెబ్ కుమారులు రమేశ్‌బాబు, రవికుమార్, కుమార్తె పద్మజ పర్యవేక్షణలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఆర్డీవో హాజరై తొలుత సూక్తి సుధాలహరి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూలమల్లికార్జునరెడ్డి, సైకాలజిస్ట్ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, విశ్రాంత అధ్యాపకుడు ఎంసీ వెంకటయ్య, ఇమాంసాహెబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదరికం, అస్పృశ్యతలే తన గురువులన్న జాషువా



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నా జీవితం వడగాల్పులైనా నా కవిత్వం వెన్నెల వెలుగు అని, పేదరికం, అస్పృశ్యతలే నా గురువులని గుర్రం జాషువా చాటిచెప్పారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. కవికోకిల గుర్రం జాషువా జయంతిని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఘనంగా నిర్వహించి ఆయన రచనలపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సమరసతాస్వరం, జాతీయతా గళం, కవికోకిల గుర్రంజాషువా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ,ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు సాయిప్రసాద్, పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలకు కృషి

● ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఏపి ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని ఎన్జీవోల కో-ఆరేటీవ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటి స్థలాలు రాని 2000మంది సభ్యులకు స్థలాలు కేటాయింపు కోసం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి 300 ఎకరాల భూమిని కూడా చూడడం జరిగిందన్నారు. రాష్ట్ర సంఘం ద్వారా ప్రభుత్వానికి ప్రపోజల్ పంపామని, అందరికీ ఇంటి స్థలాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అంతకుముందు హౌస్‌బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పారదర్శకంగా పాటుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నిత్యపూజయ్య, డైరెక్టర్లు కంభం చిన్నయ్య, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, బాలమురళి, రాఘవరెడ్డి, నరసింహ, సుబ్బారెడ్డి, శివశంకరయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీకాం కంప్యూటర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో బీకాం కంప్యూటర్స్ కోర్సులో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం (29వ తేదీ)లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్స్ ఈనెల 29 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధునిక బోధన విధానం, పరిశోధన, సెమినార్లు, వర్క్‌షాపులు, 50వేల పుస్తకాల గ్రంథాలయం, వసతి గృహాలు, క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

అష్ట సిద్ధి ప్రదాతే నమః

మహాచండీ దేవిగా రెడ్డెమ్మతల్లి
పీలేరులో రౌద్రాల అంకాలమ్మ
మదనపల్లెలో ఆకట్టుకుంటున్న దుర్గామాత అలంకరణలు


గండబోయనపల్లెలో మహాచండీదేవి అలంకరణ


గాయత్రీ దేవి అలంకరణలో పీలేరు కన్యకా పరమేశ్వరి


మహాచండిగా ప్రత్యేక పూజలందుకుంటున్న బండ్లవంక నడి వీధి గంగమ్మ - నీరుగట్టువారిపల్లెలో ప్రత్యేక పూజలందుకుంటున్న దుర్గమ్మ - కమ్మగడ్డవీధిలో శాకంబరిగా - ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి (కలకడ)

నవరాత్రుల్లో అష్ట సిద్ధి ప్రదాత మహా చండి అవతారం అత్యంత శక్తివంతమైనదని, ఈ అవతారంలో అమ్మవారు అతి దారుణమైన రాక్షసులను సంహరించి ధర్మాన్ని స్థాపించిందని అర్చకులు భక్తులకు తెలియజేశారు. మహా చండి అవతారంలో ఉన్న అమ్మవారిని పూజిస్తే అహంకారం, దురాశ, కోపం, మోహం వంటి వ్యతిరేక శక్తులు తగ్గుతాయని, శత్రు నివారణ, ఆత్మ విశ్వాసం పెంపు, విజయం లభిస్తాయని వారు భక్తులకు తెలిపారు.


చింతపర్తిలో చాముండేశ్వరీదేవిగా కన్యకాపరమేశ్వరి

గుర్రంకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు ఆదివారం మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పోలేరమ్మ అమ్మవారు చాముండేశ్వరిదేవిగా భక్తులను అనుగ్రహించారు. తరిగొండ వాసవీ మాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులను కరుణించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

చాముండేశ్వరీ దేవిగా చౌడేశ్వరిదేవి

కలకడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోన చౌడేశ్వరి అమ్మవారు చాముండేశ్వరి దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీర్థప్ర సాదాలను అందజేశారు.

మహాచండీగా రౌద్రాల అంకాలమ్మ

పీలేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ మహా చండి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దిన్ని గంగమ్మ చాముండేశ్వరి దేవిగా, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ మహాచండీ దేవిగా, మోడల్ కాలనీ ఎల్లమ్మ తల్లి మహాచండీగా భక్తులకు కనువిందు కలిగించారు. అమ్మవార్లను పరిమళభరిత సుగంధ పుష్పాలతో అలంకరించారు. ఉలవల గంగమ్మ, తిరుపతి రోడ్డులోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో సాయంత్రం అర్చకులు మహిళలతో సామూహిక కుంకుమార్చన పూజలు చేయించారు. వేర్వేరు కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ చైర్మన్‌లు కె.రామకృష్ణా రెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, రామిరెడ్డి, వెంకటమ్మ, శేఖర, ఈఓ మంజుల, సభ్యులు చంద్రారెడ్డి, వంశీ, మదనమోహన రెడ్డి, బాబు రెడ్డి, రఘునాథ్, షామియాన జయన్న, భాస్కర రెడ్డి, అర్చకులు చంద్రశేఖర శర్మ, ఆంజనేయులు, భరత్ స్వామి, గణేశ్ పాల్గొన్నారు.

మహాచండీగా కలికిరి యల్లమ్మ తల్లి

కలికిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలికిరి యల్లమ్మ ఆలయంలో అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు పూర్తి చేసి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. వాసవీమాతను దుర్గాదేవిగా తీర్చిదిద్దారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


కలికిరిలో దుర్గాదేవిగా వాసవీమాత

ప్రత్యంగిరా దేవీ నమోస్తుతే..

వాల్మీకిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాల్లో అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. నల్లవీర గంగాభవాని ఆలయంలో అమ్మవారికి ప్రత్యంగిరాదేవి అలంకరణతో విశేష పూజలు నిర్వహించారు. కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని వారాహిదేవిగా, బజారువీధిలోని వాసవీ అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా, వాల్మీకినగర్‌లోని బోయకొండ గంగమ్మను మహాచండీదేవిగా, గండబోయనపల్లె కోటలో సత్యమ్మతల్లి, గొల్లపల్లె విరూపాక్షమ్మ తల్లి ఆలయాల్లో మహాచండీదేవిగా అలంకరించారు. కార్యక్రమాల్లో ఆలయాల ధర్మకర్తలు మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి, పులి సత్యారెడ్డి, కువైట్ శంకరాచారి, తబ్జాల సతీష్, కాంతరాజుశెట్టి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, ఉత్తన్నస్వామి, జనార్ధన స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో వారాహిదేవిగా లక్ష్మీకామేశ్వరి

అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే..

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి శాకాంబరిగా భక్తులకు దర్శనం అనుగ్రహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, నీలకంఠ, కొరమట్ల నాగరాజ, మోహన్, కమలమరి కృష్ణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి ఆంజనేయులు, శీలం రమేష్‌బాబు, లోకేష్, ప్రభాకర్ పర్యవేక్షించారు. కోర్టులో గంగమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కన్యకాపరమేశ్వరీ దేవి భువనేశ్వరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ట్రెజరర్ సూరే గిరిధర్ పర్యవేక్షించారు. దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయం, రాజరాజేశ్వరీ ఆలయంలో అన్నపూర్ణేశ్వరి అలంకరణ ఆకట్టుకుంది. బాట గంగమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. కమ్మగడ్డవీధిలో నాదేళ్ల అరుణ్‌తేజ్ బృందం, నాగిరెడ్డి వీధిలో విజేంద్ర, దానేశ్, జశ్వంత్‌లు, ఈశ్వరమ్మకాలనీలో, నీరుగట్టువారిపల్లెలో, సిరికల్చర్ కాలనీలో నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు.

గజలక్ష్మిదేవిగా మాతమ్మతల్లి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు.

కురబలకోటలో మహాచండీగా...

కురబలకోట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరీ అమ్మవారు మహాచండీగా దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేసి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నాగరాజగుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, అమర్‌నాథ్, మారుతీ కుమార్, రామ్మోహన్, రాధారాణి, పుష్పలత, సరళ, అర్చకులు సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లె నాగిరెడ్డివీధిలో విశేష పూజలందుకుంటున్న దుర్గమ్మ

ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎం రోడ్డులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వృత్తి నైపుణ్యాలపై విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికల పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విద్యార్థినిలకు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థినిల భవిష్యత్తును ఉత్తమంగా తీర్చి దిద్దుకునేందుకు స్వయం ఉపాధికి అవసరమైన అపారెల్ (వస్త్రతయారీ) రంగంలో ప్రత్యేక శిక్షణ అందించి వారిని ప్రతిభా వంతులు చేయడమే ఈ పథకం లక్ష్యమని ఎస్ఓ శైలజ అన్నారు. ఇంటర్ విద్యార్థినిలకు ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా టైలరింగ్‌పై శిక్షణ అందిస్తున్నారు. ఒకేషనల్ శిక్షకురాలు ఎంకే.రోజా ఉన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్‌కు సన్మానం


ఏపీఐఐసీ డైరెక్టర్ డాక్టర్ మైఫోర్స్ మహేష్‌ను సన్మానిస్తున్న కూటమి నేతలు

పెద్దమండ్యం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ నూతన డైరెక్టర్ డాక్టర్ మైఫోర్స్ మహేష్‌ను పెద్దమండ్యం కూటమి నేత బీటెక్ సుమన్ సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ మైఫోర్స్ మహేష్‌ను ఏపీ ఐఐసీ డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా పెద్దమండ్యం కూటమి నేతలు మదనపల్లిలో సన్మానించారు. కూటమి నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు కోసం కృషి చేసి నిరుదోగ్య యువతకు ఉదోగ్యాలు కల్పించాలన్నారు. నిరుద్యోగ యువత ఉదోగ్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ కృషి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ పెద్దపీట వేశారని ఏపీ ఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు గల్లా నారాయణ, చంద్రారెడ్డి, ఉదయ్‌కుమార్, తోట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


రాష్ట్ర, జిల్లా నేతలతో పీలేరు రజక సంఘం కార్యవర్గ సభ్యులు

పీలేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీ సాయిబాబా రజక సహకార సంఘం అధ్యక్షుడిగా పట్నం రమణ, ప్రధాన కార్యదర్శిగా కందూరు వెంకటరమణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా సిద్దయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ రాష్ట్ర రజక జనసేవ సంఘం అధ్యక్షుడు అక్కినపల్లె లక్ష్మయ్య, అధికార ప్రతినిధి మల్లెల నాగరాజు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

కృష్ణమూర్తి మృతి టీడీపీకి తీరని లోటు


నివాళులర్పిస్తున్న కల్పనారెడ్డి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎర్రసానిపల్లె టీడీపీ నేత పోతబోలు కృష్ణమూర్తి మృతి పార్టీకి తీరని లోటని నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, టీడీపీ మహిళా నేత కల్పనారెడ్డి అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్ధమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోము, గ్రామాధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, నివాళులర్పించారు.

నృత్య ప్రదర్శనలో పీలేరు బాలిక ప్రతిభ


ప్రశంసా పత్రం అందుకుంటున్న పుట్టా వర్షిణి

పీలేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగిన నృత్య ప్రదర్శనలో పీలేరు వాసి పుట్టా వర్షిణి ప్రతిభ కనబరిచి నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంది. పీలేరు వాసులు పుట్టా శ్రీనాథ్, హైమావతి దంపతుల కుమార్తె వర్షిణి 7వ తరగతి చదువుతూ ఆదివారం జరిగిన భరతనాట్యం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. వర్షిణిని ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, బంధువులు అభినందించారు.

బాలకృష్ణపై ట్రోల్ సిగ్గుచేటు


విలేకరులతో మాట్లాడుతున్న రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జేవెంకటేష్

మదనపల్లి టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసీపీ శ్రేణులు ట్రోల్ చేయడం సిగ్గుచేటని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జేవెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ అప్పట్లో సినీ నిర్మాతలను, హీరోలను తన ఇంటికి పిలిచి అవమానించారనే విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై బాలకృష్ణ కలగజేసుకుని మాజీ సీఎం జగన్ సైకో అని సంబోధించడాన్ని వైసీపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇందులోకి చిరంజీవిని లాగి కుల రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్వర్‌బాషా, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

భూచదును పనుల అడ్డగింత - ఉద్రిక్తత


సంఘటనా స్థలంలో పోలీసులు, చలపతి కుటుంబ సభ్యులు

పీలేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తమ భూమిలో దౌర్జన్యంగా చదును చేస్తున్నారంటూ ఇద్దరు విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు కుటుంబసభ్యులతో అడ్డుకోవడంతో ఆదివారం పీలేరులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆవువారిపల్లె విశ్రాంత గ్రూప్-1 అధికారి వెంకటరమణ వారం రోజులుగా ఆవువారిపల్లె వద్ద భూమి చదును పనులు కొనసాగిస్తున్నారు. అయితే ఆయన తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా పనులు నిలపమని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదంటూ అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు శ్రీనివాస రాజు, చలపతి ఆదివారం చదును పనులను అడ్డుకున్నారు. ముడుపులవేముల పరిధిలోని సర్వే నెం.440/1లో తమకు 3.75 ఎకరాల భూమి ఉండేదని, ఎన్‌హెచ్ 18 విస్తరణ కోసం ప్రభుత్వం 2003లో 1.34 ఎకరాలు తీసుకుని రూ.90 వేల పరిహారం చెల్లించగా మిగిలిన భూమిని తాము అనుభవించుకుంటున్నామని వారు తెలిపారు. తమ భూమిపై కన్నేసిన వెంకటరమణ నకిలీ పట్టాలు సృష్టించి నాలుగేళ్లుగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారని వారిద్దరూ ఆరోపించారు. ఇటీవల తాము ఆ విషయాన్ని జిల్లా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా కోర్టులో కూడా దావా వేశామన్నారు. అయితే వెంకటరమణ ఈ నెల 20వ తేదీ నుంచి తమ భూమిలో హిటాచీలు, ఎక్సకవేటర్లతో చదును పనులు ప్రారంభించారని, వాటిని ఆపమని తాము పలుమార్లు అభ్యర్థించినా ఖాతరు చేయకపోవడంతో చేసేది లేక తాము ఆదివారం సాయంత్రం ఆ పనులను అడ్డుకున్నామన్నారు. అడ్డుకున్న తమపై వారిద్దరూ దౌర్జన్యం చేశారని వాపోయారు. అయితే వీరి ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని శ్రీనివాస రాజు, చలపతి అభ్యర్థించారు. పోలీసులు వెనుదిరిగిన కాసేపటికే వెంకటరమణ తిరిగి చదును పనులు చేస్తున్నాడని, పోలీసులు, రెవెన్యూ అధికారుల సలహాలు, కోర్టు ఆదేశాలను కూడా ఆయన పట్టించు కోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. కొత్తవారిపల్లె, పోతబోలు పంచాయతీల్లో ప్రచార వాహనం ద్వారా ప్రజలకు అందజేశారు. సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సురష్మైళి, నారాయణమ్మ, శేఖర్, లీలావతి, శ్రీదేవి, సుమలత, సునీత, రామయ్య, అవినాశ్ పాల్గొన్నారు.

కోదండరాముడి భక్తులకు మౌలిక వసతులు అందేనా?


ఒంటిమిట్ట కోదండ రామాలయం

● నిపుణుల కమిటీ ప్రణాళికలు సిద్ధమయ్యేనా?.. ● పనులు ప్రారంభం అయ్యేనా?

ఒంటిమిట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం విడిపోవంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒంటిమిట్ట కోదండరామునికి ప్రభుత్వం తరపున ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 2015 ఆలయ అభివృద్ధి కోసం ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని టీటీడీలో విలీనం చేశారు. టీటీడీ అధికారులు ఆలయ అభివృద్ధి కోసం అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తూ వస్తున్నారు. కాని భక్తుల మౌలిక వసతుల గురించి పట్టించుకోకపోవడంతో సరైన వసతులు లేక భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాత్రివేళల్లో ఇక్కడ బస చేయాలంటే కష్టంగా ఉందని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళ ఆరుబయటనే నిద్రపోవాల్సి వస్తుండటంతో దోమలు, దొంగలతో భయపడుతున్నారు. దీంతో భక్తులు రాత్రివేళ ఇక్కడ బస చేయకుండా వెళ్లిపోతున్నారు. ఈ యేడాది సీతారాముల కల్యాణం ఉత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేశారు. కల్యాణం అనంతరం టీటీడీ అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు నిపుణుల కమిటీతో ప్రణాళికలు తయారు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు కొద్దిరోజుల క్రితం నిపుణుల కమిటీ ఒంటిమిట్టకు వచ్చి ఆలయ మాడవీధులు, రథశాల, పుష్కరిణి, సంజీవరాయస్వామి ఆలయం, మాల ఓబన్న స్థూపం, శృంగిశైలం, సత్రపాలెం, కొండరామ లక్ష్మణ తీర్థాలు, కల్యాణవేదిక ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలి, ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి అన్న విషయంపై చర్చించుకున్నారు.

గుర్తించిన పనుల వివరాలు..

భక్తులకు ఆహ్లాదపరిచేలా శిల్పారామం, పక్షుల పార్కు, ఔషధ ఆయుర్వేద ఉద్యానవనాల ఏర్పాటు, మాడవీధుల విస్తరణ, ఒంటిమిట్ట చెరువు అభివృద్ధి సుందీకరణ, వావిలకొలను సుబ్బారావు ధ్యానమందిరాన్ని కొత్తగా నిర్మించడం, శృంగిశైలం చుట్టూ గిరిప్రదక్షిణ కోసం రహదారి, ఆలయ సమీపంలోని నాగేటి తిప్పసత్రపాలెం, కొండగుట్టలకు హరిత శోభ తెచ్చేలా మొక్కల పెంపకం, కల్యాణవేదిక వద్ద శిల్పాల ఏర్పాటు, మాల ఓబన్న మండపం, యాత్రికులు విడిది చేయడానికి అనువైన గదులు, శుభ కార్యాలయాలకు కల్యాణమండపం, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక తదితర పనులను నిపుణుల కమిటీ గుర్తించినట్లు తెలిసింది. కాని ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. నిపుణుల కమిటీ ప్రణాళికలు సిద్ధం చేశాయా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సిద్ధమై ఉంటే పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని రామభక్తులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.


ఒంటిమిట్టలోని మాల ఓబన్న స్థూపం


శృంగిశైలి పర్వతం

జాతీయ స్థాయిలో ప్రభావితమైంది..



ఒంటిమిట్ట కోదండరామాలయం ఈనాడు రాష్ట్రస్థాయిని దాటి జాతీయ స్థాయిని కూడా అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో ప్రభావితమైంది. తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకవర్గం, రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ పసుపులేటి శంకర్, పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు, ఒంటిమిట్ట

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి..



ఒంటిమిట్ట కోదండరామస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి. వసతులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

- సోమిశెట్టి మనోహర్‌బాబు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు, ఒంటిమిట్ట

అమ్మానాన్న లేరు..

● అనాథలైన చిన్నారులు


అనాథలుగా మారిన చిన్నారులు లక్ష్మి, యశ్వంత్

దువ్వూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆలన, నాన్న పాలనలో పెరగాల్సిన చిన్నారులు ఆ అదృష్టానికి దూరమయ్యారు. బ్రతుకు బండి ఎలా లాగాలో, బ్రతుకుదెరువు ఏమిటో తెలియని అన్నాచెల్లెలుకు కన్నతల్లిదండ్రులు మరణించడంతో పలువురిని కలచివేస్తోంది. 105రోజుల వ్యవధిలో మొదట తల్లి, ఈనెల 28న శనివారం తండ్రి మరణంతో ఏడేళ్ల యశ్వంత్, ఆరేళ్ల లక్ష్మి అనాథలయ్యారు.

దువ్వూరు గ్రామానికి చెందిన నరసింహులు (30) కామెర్ల వ్యాధితో బాధపడున్నాడు. దీంతోపాటు శనివారం పిట్స్ కూడా రావడంతో అకస్మాత్తుగా మృతి చెందాడు. ఇదే సంవత్సరం జూన్ నెల మధ్యలో చిన్నారుల కన్నతల్లి గంగాభవానీ (26) అనారోగ్య కారణంగా మృత్యువాత పడింది. తల్లి మరణించిన 105 రోజులకే తండ్రి కూడా మృతి చెందడంతో చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం తాత బాలరంగడు ఈ బిడ్డలకు జీవనాధారమయ్యాడు. ఈ సంఘటన చుట్టుపక్కలవారిని కంటతడిపెట్టిస్తోంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● చిన్నారులకు తీవ్ర గాయాలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సమీపంలోని ఇరుకురాళ్ల బోటు వద్ద స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇరువురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. కడపలోని రవీంద్రనగర్‌కు చెందిన పట్నం ఆదిలక్షుమ్మ(65) తన మనవడు సాయికిరణ్, మనవరాలితో కలిసి ఆదివారం ఉదయం 11గంటలకు నందలూరు నుంచి కడపకు స్కూటీలో బయలుదేరారు. ఇరుకురాళ్ల బోటు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో వీరిని కడప రిమ్స్‌కు తరలించగా ఆదిలక్షుమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

కడప క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్ గూడ్స్ గోడలు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45సంవత్సరాల మధ్య ఉంటుందని, గూడ్సు గోడల వద్ద ఉండేవాడని, అయితే అనారోగ్య కారణంగా మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ గుర్తించినవారు 9121100510, 9121100511 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు కథనం మేరకు... ముష్టూరుకు చెందిన ఖాసీమ్ తన ఆటోలో ప్రయాణికులను మదనపల్లికి తరలిస్తుండగా రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లీలాప్రియదర్శిని, ప్రియాంక, చెంద్రాయుడు, హరిత, మరొకరు గాయపడ్డారు. గాయపడిన వారిని మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కట్టా పుట్టాలమ్మ ఆలయంలో చోరీ

ఓబులవారిపల్లె/రైల్వేకోడూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న కట్టా పుట్టాలమ్మ దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు సమాచారమిచ్చారు. రైల్వేకోడూరు ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలో ఉన్న బీరువాలను పగులగొట్టి అందులో ఉన్న నగదును, పలు వస్తువులను దొంగలు అపహరించుకుని వెళ్లినట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ మేరకు విచారిస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన బెస్తల అమరావతి(68) కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. అమరావతికి మతిస్థిమితం సరిగాలేదని, ఆమె ఈనెల 25వ తేదీ సాయంత్రం నుంచి అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9121100530కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

● కర్ణాటక ఆర్టీసీ బస్సు - బైకు ఢీ


ప్రమాదంలో మృతి చెందిన జస్వంత్ (ఫైల్)

పెద్దదోర్నాల,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ప్రయాణిస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి కొత్తూరు సమీపంలో ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లెకు చెందిన ఈడగొట్టు జస్వంత్ (21) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జస్వంత్ మార్కాపురంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. జస్వంత్ సొంతపని మీద బైకుపై కర్నూలు వెళ్లి తిరిగి మార్కాపురం వస్తుండగా దోర్నాల మండలం కొత్తూరు వద్దకు రాగానే శ్రీశైలం నుంచి వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం బళ్లారి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. జస్వంత్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి ఒక్కరూ చదవాల్సిన రచన

మదనపల్లె టౌన్ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ చదవాల్సిన రచన జొన్నవిత్తుల సాక్షాత్కారం అని ప్రముఖ రచయిత డేరంగుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవలా రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచన సాక్షాత్కారం పరిచయ సభ నిర్వహించారు. ప్రముఖ కథకుడు టీఎస్ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ జొన్నవిత్తుల రమచంద్రమూర్తి రచించిన సాక్షాత్కారం నవల నేటి టెలివిజన్ కార్యక్రమాలతో సమాజంలో సంభవిస్తున్న అనర్థాలపై కాగడా పట్టిందన్నారు.

ఆర్నెళ్లలో మదనపల్లె జిల్లా హామీ ఏమైంది..?

● ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేశ్‌ను ప్రశ్నించిన జిల్లా సాధన సమితి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్నెళ్లలో మదనపల్లె జిల్లా చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం జీఆర్టీ స్కూల్‌లో మలిదశ మదనపల్లె జిల్లా ఉద్యమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 5న నాలుగు నియోజకవర్గాల్లో ఉద్యమ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సాధన కోసం తొలివిడత 633రోజుల పాటు సాగిన ఉద్యమంలో ప్రత్యక్ష, పరోక్షంగా భాగస్వాములైన వారికి అభినందనలు తెలిపారు. ఈ ఉద్యమం రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. మదనపల్లెలో మినీ మహానాడు, బెంగళూరు బస్‌స్టాండ్‌లో జరిగిన ఎన్నికల సభల్లో చంద్రబాబు తమ ప్రభుత్వ అధికారంలోకి రాగానే మదనపల్లె జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అలాగే యువగళం పాదయాత్ర సందర్భంగా పీలేరు, మదనపల్లెలో నిర్వహించిన సభల్లో నారా లోకేష్ కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదహారు నెలలు కావస్తున్నా మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్ష మేరకు మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. ఇందులో ప్రజలు పాల్గొని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. రెండు నెలల్లో జిల్లా విషయం తేల్చాలని డిమాండు చేశారు. మలిదశ ఉద్యమం అక్టోబరు5న పీలేరులో వీసీకే పార్టీ-బాస్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, మదనపల్లె, బి.కొత్తకోటలో సీపీఐ, బహుజన సమాజ్‌పార్టీ, బహుజనసేన ఆధ్వర్యంలో మలిదశ ఉద్యమాల సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బీటీ కళాశాల కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం, వీసీకే ఎ ార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నేత రెడ్డి సాహెబ్, సీపీఐ రాష్ట్ర నేత కృష్ణప్ప, బహుజన సాజ్‌పార్టీ పుంగనూరు నేత అడ్వొకేట్ శ్రీనివాస్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కేవీ రమణ, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసుల, నాగరాజ, మునిగోపాలకృష్ణ, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కావాలంటే గ్రోమోర్ కొనాల్సిందే


మాట్లాడుతున్న ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి

పీలేరు రూరల్, సెప్టెబరు 28 (ఆంధ్రజ్యోతి): యూరియా కావాలంటే గ్రోమోర్ కొనాల్సిందే అంటూ పట్టణంలో ఎరువుల దుకాణాల్లో వ్యాపారులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండల సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. ఎర్రగుంటపల్లె ఎంపీటీసీ అమరనాథరెడ్డి, వేపులబైలు ఎంపీ టీసీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అవసరాల మేరకు ఎరువుల షాపుల్లో యూరియా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈఏ రమాదేవి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని షాపుల యజమానులకు హెచ్చరించినట్లు తెలిపారు. కొత్త చెరువుకు మర్మతు చేయించాలని డిమాండ్ చేశారు. సుబ్బారెడ్డిగారిపల్లె లో 11కేవీ విద్యుత్ వైర్లు చేతికందేంత ఎత్తులో ఉన్నాయని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ ఆరోపించారు. మేళ్లచెరువు ఎంపీటీసీ కిరణ్ మాట్లాడుతూ రెడ్డివారిపల్లెలో ప్రాథమిక పాఠశాల మూసివేయడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరం పాఠశాల తెరిపించాలని కోరారు. తలపుల - మేళ్లచెరువు రోడ్డులో ముళ్లపొదలు తొలగించేందుకు జంగిల్ క్లియరెన్స్ చేయించాలని కోరారు. పీలేరు ఎంఈఓ లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డివారిపల్లెలో విద్యార్థులు లేనందునే తాత్కాలికంగా పాఠశాల మూసేశామని, విద్యార్థులు వస్తామంటే వెంటనే పాఠశాల తెరుస్తామని హామీ ఇచ్చారు. జంగంపల్లె పాఠశాలకు దారి వసతి కల్పించాలని కోరారు. 100 పడకల ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మండల సమావేశంలో ఏకగ్రీకంగా తీర్మానించారు. పీలేరు ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓ సిగ్నతుల్లా, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజేశ్వరి, వైస్ ఎంపీపీ చలపతి, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌బాషా, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా పర్యటనలో మైనార్టీ నేతలతో ఎంఏ షరీఫ్ సమావేశం


సమావేశంలో ఎంఏ షరీఫ్‌కు వినతపత్రం అందిస్తున్న మైనార్టీ నేతలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక సలహాదారుడు ఎంఏ షరీఫ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం అన్నమయ్య జిల్లాలో పర్యాటించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని హార్సిలీహిల్స్ కేంద్రంగా జిల్లాలోని మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ముస్లిం మైనార్టీ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. సంబంధింత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగూరు, పీలేరు నియోజకవర్గాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్యం


ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గుర్రంకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంకొండ పంచాయతీ దౌలత్‌ఖాన్‌పల్లెలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుర్రంకొండ టీడీపీ నేత బాబాజాన్ పర్యవేక్షణలో లత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, జ్వరంతో బాధపడుతున్న రోగులకు రక్త పరీక్షలను నిర్వహించారు. సుమారు 250 మంది రోగులకు మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో చాలామంది పేదలు వివిధ రకాల జబ్బులతో బాధతున్నట్లు తెలియడంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. పేద ప్రజల సమస్యలను తీర్చడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గంగాధర్ నాయుడు, కే.ఎస్.అహ్మద్, నేతలు ఎండీ.జమీర్, పర్వేజ్, చింటు, సిద్ధిక్, ఫారుక్, అక్రమ్, ఇస్మాయిల్, విష్ణు, మురాషావలి, ఇర్షాద్, అస్లామ్, షౌత్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

26 ఏళ్ల తర్వాత..


26 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. 1998-99లో టెన్త్ చదువుకున్న విద్యార్థులు 26 ఏళ్ల తరువాత మళ్ళీ ఇప్పుడు కలుసుకున్నారు. ఈ సందర్భంగా చదువుకున్న సమయంలో చేసిన అల్లరిని గుర్తుకు చేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ప్రస్తుతం స్థిరపడ్డ రంగాల గురించి ఒకరికొకరు చెప్పుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు రెడ్డెమ్మ, ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అలీఖాన్, బాబాజాజ్, రమేష్, ఖాదర్, గౌస్ బాషా, బాలాజీ, శంకర, హరినాధ్, రెడ్డిశేఖర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మస్తాన్, లక్ష్మీనారాయణ, ఉత్తన్న, చంద్రశేఖర్, మున్నా, భారతి, నసీబ్ జాన్, రెడ్డిరాని, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత..


20 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని, సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలిసి తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకుచదువుల చెప్పిన గురువులు రుషికేశ్వర్, సురేంద్రబాబు, కృపానందచ కృష్ణమూర్తి, రమణప్ప, విష్ణు వర్దన్, పద్మజా,రవీంద్ర, భద్రయ్యలను విద్యార్థులు దుశాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పరిప్రసాద్, మల్లికార్జున, లోకేస్, అంజనేయ నాయక్, సుధాకర్, చంద్రకళ, వెంకటలక్ష్మీ, నాగలక్ష్మీ, పద్మజ, మహేశ్వరీ, మంజుల, మంజుభార్గవి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక


జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులతో పోతుల సాయినాథ్

ములకలచెరువు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కురబలకోటకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం జనసేనలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ సమక్షంలో వైసీపీ నేతలు మనోజ్, భరత్, రమేష్ తమ అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. పవన్‌కళ్యాన్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి చేరామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు సుదర్శన్, పూజారి సురేంద్ర, పవన్‌రెడ్డి, అనీల్, భరత్‌రెడ్డి, గల్లా అంజి, సుధీర్, పూల చంద్ర, వినోద్, నరేంద్ర, రుక్మానాధం, మధు తదితరులు పాల్గొన్నారు.